క్లుప్తంగా

తిరుమలేశునికి విశేష పుష్పాలతో సహస్ర నామార్చన



విశేష పుష్పాలతో శ్రీదేవి భూదేవి సహిత తిరుమలేశుని అలంకరించిన దృశ్యం

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో తిరుమలేశునికి నిత్య పూజలు జరుగుతున్నాయి. శనివారం వేకువ జామున సుప్రభాతం, తోమాల సేవలు నిర్వహించి, భక్తులకు సర్వదర్శనం కల్పించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం తిరుమలేశునికి విశేష పుష్పాలతో సహస్ర నామార్చన నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత తిరుమలేశునికి విశేష పుష్పాలంకరణ చేశారు. అనంతరం నక్షత్రహారతి, కుంభహారతి నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలు శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో జరిగాయి.

కొనసాగుతున్న వాటర్ బాటిళ్ల పంపిణీ



ప్రయాణికులకు వాటర్ బాటిళ్లను అందిస్తున్న సేవా సంస్థల ప్రతినిధులు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ వద్ద మధ్యాహ్నం వచ్చే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలులోని సాధారణ, మహిళా, దివ్యాంగుల బోగీలలోని ప్రయాణికులకు సేవా సంస్థలు మినరల్ కూలింగ్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశాయి. నెల రోజులుగా ఈ కార్యక్రమం దువ్వాడ రైల్వేస్టేషన్‌లో కొనసాగుతోంది. శనివారం మధ్యాహ్నం జరిగిన కార్యక్రమంలో 150 మందికి ఉచితంగా మంచినీటిని అందించారు. ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బుడుమూరు వెంకట రమణ, అతని సిబ్బంది సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కంచుమూర్తి ఈశ్వర్, ఎం.ఎస్.ఎన్.మూర్తి, వి.జాషువా, కామేశ్వరరావు, జీవీ ప్రసాద్, జోగారావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య తీర్చండి



కాపుజగ్గరాజు పేట రైల్వే బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ జాం

అక్కిరెడ్డిపాలెం: కాపుజగ్గరాజుపేట రైల్వే బ్రిడ్జి వద్ద నిత్యం తీవ్ర ట్రాఫిక్ జామ్ సమస్యతో పాటు ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వాహనాలు, ఆటోలు, ఇతర వాహనాలు ఇష్టారాజ్యంగా ప్రయాణిస్తుండటం, వాహన చోదకులు నిబంధనలు పాటించకపోవడంతో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమవుతోంది. ఈ పరిస్థితి రైల్వే అధికారులు, డీఆర్‌ఎం అధికారులు, ట్రాఫిక్ పోలీసుల దృష్టికి వెళ్లకపోవడం శోచనీయమని కాపుజగ్గరాజు పేట, లక్ష్మీ గార్డెన్ నివాసి గంగామహేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలు జరిగితేనే అధికారులు స్పందిస్తారా అని ప్రశ్నించారు. రైల్వే బ్రిడ్జి పరిస్థితిని పరిశీలించి తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు.

ఉక్కు అభివృద్ధికి జనార్దన్ విశేష కృషి



మాట్లాడుతున్న తిప్పల నాగిరెడ్డి

ఉక్కునగరం: ఉక్కు కర్మాగారం అభివృద్ధికి జనార్దన్ తన వంతు కృషి చేశారని గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. స్టీల్ ప్లాంట్ ఆర్‌ఎంహెచ్‌పీ కార్మికుడు, వైఎస్సార్‌టీయూసీ నాయకుడు కూటికుప్పల జనార్దన్ పదవీ విరమణ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి నాగిరెడ్డి హాజరై మాట్లాడారు. వైఎస్సార్‌టీయూసీ నాయకుడిగా కార్మికుల హక్కుల కోసం జనార్దన్ పని చేశారని నాగిరెడ్డి ప్రశంసించారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, నక్క వెంకటరమణ, బి. శశిభూషణరావు, పిట్టారెడ్డి, ఉమాశంకర్, గొందేశి రాము, ధర్నాల అప్పలరెడ్డి, తిప్పల గుర్నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం రావడమే, పేదల పాలిట వరంగా వచ్చిన ఇంటింటికీ రేషన్ పంపిణీకి గండి కొట్టేసింది. గత ప్రభుత్వ హయాంలో ఇంటి వద్దకే డోర్ డెలివరీ అయిన రేషన్ సరుకుల్ని, ఇకపై షాపుల దగ్గర క్యూ కట్టి తీసుకోవాల్సిందేనట. జూన్ 1 నుంచి ఈ కొత్త 'సినిమా' మొదలవుతుంది. ఎండీయూ వాహనాలు ఇంటి దగ్గరికే వచ్చి, కూలీ పనులకు వెళ్లేవారికి ముందుగానే సమాచారం ఇచ్చి మరీ రేషన్ అందించేవి. అప్పుడు పనికి ఆటంకం లేదు, సమయ నష్టం లేదు. ఇప్పుడు మళ్లీ గంటల తరబడి రేషన్ షాపుల దగ్గర పడిగాపులు పడాల్సిందే. అంటే, రోజువారీ కూలీలకు ఒక రోజు పని గల్లంతు. రెక్కాడితే గాని డొక్కాడని జీవితాల్లో ఇది మరో ఆర్థిక భారం. 'రేషన్ కోసం పని మానుకుని రావాలా? పొట్ట నింపుకోవడం కోసం పని మానుకోవడం ఎంతవరకు సమంజసం?' అని పేదలు ప్రశ్నిస్తున్నారు. ఈ నిర్ణయంపై వృద్ధులు, దివ్యాంగులకు ఆందోళన చెందుతున్నారు. - పెదగంట్యాడ





నేటి నుంచి ఇదే పరిస్థితి..

కూటమి వారి ప'రేషన్'

- ఇప్పటి వరకూ ఇంటి వద్దకే రేషన్ పంపిణీ
- నేటి నుంచి రేషన్ దుకాణాలకు వెళ్లాల్సిందే..
- ఆందోళనలో తెల్ల రేషన్ కార్డుదారులు
- వృద్ధులు, దివ్యాంగులకు తప్పని కష్టాలు

తెల్ల రేషన్ కార్డుదారులకు నేటి నుంచి ఇబ్బందులు తప్పేలా లేవు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ సరుకులు అందించేందుకు ప్రవేశపెట్టిన ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) వాహనాల ద్వారా పంపిణీ విధానాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో జూన్ 1వ తేదీ నుంచి లబ్ధిదారులు రేషన్ దుకాణాలకు వెళ్లి సరుకులు తీసుకోవాల్సి వస్తుందని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ నిర్ణయంతో పేద ప్రజలు తీవ్ర అయోమయానికి, ఆందోళనకు గురవుతున్నారు.

కాలం, శ్రమ వృథాపై ఆవేదన



ఇంటి ముంగిటే రేషన్ సరకులు తీసుకుంటున్న కార్డుదారులు.(ఫైల్)

గత ప్రభుత్వ హయాంలో ఇంటి వద్దకే రేషన్ సరుకులు రావడం వల్ల సమయం, శ్రమ ఆదా అయ్యేవని పేదలు చెబుతున్నారు. కూలీ పనులకు వెళ్లేవారు, ఎండీయూ సిబ్బంది ముందుగానే సమాచారం ఇవ్వడం వల్ల తమ పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూసుకునేవారని గుర్తు చేసుకుంటున్నారు. ఇప్పుడు రేషన్ దుకాణాలకు వెళ్లాలంటే ఒక రోజు పని కోల్పోవాల్సి వస్తుందని, రెక్కాడితే గానీ డొక్కాడని తమ బ్రతుకుల్లో ప్రతి నెలా ఒక రోజు ఉపాధి కోల్పోవడం ఆర్థికంగా చాలా భారమని వాపోతున్నారు.

వృద్ధులు, దివ్యాంగుల పరిస్థితిపై ఆందోళన

ప్రభుత్వ తాజా నిర్ణయంతో 60 ఏళ్ల పైబడిన వృద్ధులు, వికలాంగులకు రేషన్ సరుకులు ఇంటింటికీ అందుతాయా లేదా అనే ఆందోళన వారిలో పెరిగింది. నిన్నటి వరకు ఇంటి వద్దకే సరుకులు అందుకున్న తమకు నేటి నుంచి పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు, డీలర్లు కూడా తమకు ఇచ్చే కమిషన్ అరకొరగా ఉందని, వృద్ధులు, దివ్యాంగుల కార్డుదారులకు ఇంటింటికి వెళ్లి సరుకులు అందించడం సాధ్యం కాదని గుసగుసలాడుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం పేద ప్రజల కష్టాలను గుర్తించి, ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందించే విధానాన్ని తిరిగి కొనసాగించాలని పేద ప్రజలు కోరుతున్నారు. ఈ అంశంపై తక్షణమే ప్రభుత్వం స్పందించి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విరాళాలు



ట్రస్ట్ ప్రతినిధులకు విరాళాలు అందజేస్తున్న దాతలు రాంబాబు, బాలామణి దంపతులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని ఎస్టీబీఎల్‌లో ఉన్న శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో ఈనెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు జరగనున్న శ్రీవారి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణకు దాతలు తమ వంతు విరాళాలను అందిస్తున్నారు. బొంగు రాంబాబు, బాలామణి దంపతులు రూ.20 వేలు, యూఎస్ఏకు చెందిన సీహెచ్. అజయ్‌కుమార్, సౌజన్య దంపతులు గరుడ ప్రసాద వితరణకు రూ.5 వేలు విరాళం అందజేశారు. అన్న ప్రసాద వితరణకు వీరంకి మాధవరావు, శివలక్ష్మి దంపతుల కుమారుడు వీరంకి అనీల్‌కుమార్ రూ.10,116, సూర్యదేవర వెంకట నరేష్, నవీన దంపతులు పిల్లలు స్నిగ్ధ, గాయత్రిలు రూ.10,116, షీలానగర్‌కు చెందిన శ్రీనివాస్, భార్గవి దంపతులు రూ.5,116 అందించారని ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.

ఘనంగా రాణి అహల్యాబాయి హోల్కర్ జయంతి



అహల్యాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న భువనేశ్వరి తదితరులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని నడుపూరు ఉక్కు కళావేదికలో బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు జిలకర్ర భువనేశ్వరి ఆధ్వర్యంలో శనివారం రాణి అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భువనేశ్వరి మాట్లాడుతూ, రాణి అహల్యాబాయి హోల్కర్ మరాఠాల పాలనలోని మాల్వా సామ్రాజ్యాన్ని పరిపాలించారని, హిందూ మత కార్యక్రమాలను నిర్వహించారని తెలిపారు. ఇండోర్, మహేశ్వర్ ప్రాంతాల్లో అనేక హిందూ దేవాలయాలను నిర్మించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిలకర్ర రమణ, తులసిదాస్, ఎంఎస్ఎన్ మూర్తి, సూర్యనారాయణ, వరలక్ష్మి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి



అగనంపూడి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా

అగనంపూడి: ఉద్యోగికి తాను చేసిన సేవలే గుర్తింపును తీసుకువస్తాయని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జె.భారతి ఉద్యోగ విరమణ సందర్భంగా ఆమె దంపతులను పల్లా శ్రీనివాసరావు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్య వృత్తిలో మూడు దశాబ్దాలపాటు సేవలు అందించిన డాక్టర్ భారతి, అగనంపూడి ప్రాంతీయులకు సుపరిచితురాలని పేర్కొన్నారు. సన్మాన గ్రహీత డాక్టర్ భారతి మాట్లాడుతూ, అగనంపూడి ఆస్పత్రిలో సుమారు రెండు దశాబ్దాల పాటు వివిధ హోదాల్లో పనిచేశానని అన్నారు. ఆర్‌ఎంవో, సూపరింటెండెంట్‌గా కాకుండా ఒక సర్జన్‌గా తనకు మంచి గుర్తింపు వచ్చిందని తెలిపారు. స్థానికుల ఆదరాభిమానాలు మరువలేనివని అన్నారు. కార్యక్రమం లో ఆర్‌ఎంవో డాక్టర్ ఉషా, వైద్యులు కణితి పద్మజా, గోపీకృష్ణ, లలిత ఇతర వైద్యులు, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, పరిపాలనాధికారి రవిరాజు, ఆస్పత్రి కమిటీ, బొర్రమాంబ పారాయణ సేవా సమితి, మహాత్మాగాంధీ సేవా సంఘం ప్రతినిధులతోపాటు వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, స్థానిక నాయకులు, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం జోక్యం చేసుకోవాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో సుమారు 3,000 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడంపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జోక్యం చేసుకోవాలని ఉక్కు శ్రామిక సంఘం ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కనీస వేతనాల సలహా బోర్డు మాజీ డైరెక్టర్ బొడ్డు పైడిరాజు విజ్ఞప్తి చేశారు. శనివారం ఉక్కునగరంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో పైడిరాజు మాట్లాడుతూ, గత 25–30 ఏళ్లుగా పని చేస్తున్న కార్మికులను యాజమాన్యం అక్రమంగా తొలగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. తొలగింపులపై ప్రశ్నించిన కార్మిక నాయకులకు నోటీసులు జారీ చేయడమే కాకుండా, పోలీసు కేసులు కూడా నమోదు చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ పరిణామాలు కూటమి ప్రభుత్వానికి నష్టదాయకమని పేర్కొంటూ, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని తొలగింపులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కరణం సత్యారావు, డొక్క రమేష్, గుమ్మాల నర్సింగరావు, మొల్ల ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



ఖోఖో ఆడుతున్న చిన్నారులు

పెదగంట్యాడ: మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయాధికారి పీవీ రమణ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో శనివారం చిన్నారులతో ఖోఖో ఆడించారు. అలాగే పుస్తకాలు చదివించారు. కథలు చెప్పారు. 12 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

నేడు కరాటే పోటీలు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు, మాజీ సైనిక కాలనీ వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ క్రీడా మైదానంలో ఆదివారం ఉదయం 9 గంటలకు కరాటే పోటీలు, బహుమతుల ప్రదానోత్సవం జరగనుందని కరాటే కోచ్ జీ.శ్రీనివాస్‌రావు (భరత్) తెలిపారు. ప్రభుత్వ విప్ పి.గణబాబు ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభిస్తారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ హీరో సుమన్ పాల్గొంటారన్నారు.

బీచ్‌లో కబడ్డీ.. కబడ్డీ...






ఆర్కే బీచ్‌లో కబడ్డీ సాధన చేస్తున్న గాజువాక ప్రాంత యువకులు

ఏయూక్యాంపస్: సాగర తీరంలోని ఇసుక తిన్నెలపై కబడ్డీ క్రీడాకారులు కఠోర సాధన చేస్తున్నారు. కూతకెళ్తే పాయింట్ సాధిస్తున్నారు. గాజువాక ప్రాంతానికి చెందిన కొంత మంది యువకులు కబడ్డీ క్రీడలో రాణిస్తున్నారు. వీరు శనివారం ఉదయం ఆర్కే బీచ్ సమీపంలో కబడ్డీ ఆడుతూ కనిపించారు. ఇసుకలో రెండు జట్లుగా ఏర్పడి కబడ్డీ సాధన చేస్తూ మెళకువలు నేర్చుకుంటున్నారు. వాతావరణం కూడా చల్లగా ఉండటంతో వీరి ఆట ఉత్సాహంగా సాగింది. పక్కనే కోచ్ గమనిస్తూ వారికి ఆటలో నైపుణ్యాలను అందిస్తూ, మెళకువలను నేర్పుతున్నారు. గెలుపే లక్ష్యంగా పోటీలో దూసుకుపోయే సత్తాను వీరు అందిపుచ్చుకుంటున్నారు.

పన్నుల పైనే మోజు.. వీధులేమో గలీజు..



వుడా కాలనీ ప్రధాన రహదారిలో..



స్టెప్పింగ్ స్టోన్స్ నర్సరీ పాఠశాల వద్ద..

పెదగంట్యాడ: మండలంలోని వినాయకనగర్‌లో మౌలిక వసతుల కల్పన పట్ల అధికారుల నిర్లక్ష్యం ఆ ప్రాంత ప్రజలను తీవ్రంగా వేధిస్తోంది. పన్నుల వసూళ్లలో మండలంలోనే ప్రథమ స్థానంలో ఉన్నప్పటికీ, కాలనీ వాసుల సమస్యల పరిష్కారంలో అధికారులు చివరి స్థానంలో నిలుస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. విద్య, వ్యాపారం, వాణిజ్యపరంగా దినదినాభివృద్ధి చెందుతున్న వినాయకనగర్ ప్రాంతం నేడు కింది స్థాయి అధికారుల నిర్లక్ష్యం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో మురికికూపంలా తయారైంది. డ్రైనేజీల్లో మురుగు పారక తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. పారిశుద్ధ్య పరిస్థితి అధ్వానంగా ఉండటంతో ఆయా ప్రాంతాల్లో నివసించే ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. కాలువల్లో పేరుకుపోతున్న మురుగు కారణంగా దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. చీకటి పడితే చాలు దోమలు ఇళ్లలోకి దండయాత్ర చేస్తున్నాయని, దీంతో కంటి మీద కునుకులేకుండా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా, డ్రైనేజీలన్నీ పందులకు ఆవాసాలుగా మారిపోతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎప్పటికప్పుడు చెత్తాచెదారాన్ని తొలగించడంతో పాటు కాలువలను శుభ్రం చేయించాలని వినాయకనగర్ వాసులు కోరుతున్నారు.

సందడిగా అంత్యాక్షరి



కర్చీఫ్ ఆటలో పాల్గొన్న విద్యార్థులు

గాజువాక : గాజువాక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా చిన్నారులకు శనివారం నిర్వహించిన అంత్యాక్షరి కార్యక్రమం ఆకట్టుకుంది. కేవలం జంతువుల పేర్లు చెప్పే విధంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారులు చురుగ్గా పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన కర్చీఫ్ ఆటలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల అనంతరం గ్రంథాలయాధికారి బి.చంద్రకళ విద్యార్థులకు నీతి కథలను వివరించి వాటి అర్థాలను చిన్నారులతో చెప్పించారు. ఉపాయం కథ అందర్నీ ఆకట్టుకుంది.

కౌన్సిల్ అజెండాలో ఈ అంశాలు చేర్చండి

- మేయర్‌కు సీపీఎం కార్పొరేటర్ లేఖ

దాబాగార్డెన్స్: జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం అజెండాలో పలు అంశాలను చేర్చాలని కోరుతూ సీపీఎం ఫ్లోర్‌లీడర్ డాక్టర్ బి.గంగారావు మేయర్ పీలా శ్రీనివాసరావుకు లేఖ రాశారు. ప్రస్తుతం జీవీఎంసీ పరిధిలో ఆస్తిపన్ను పెంపుదల రీసర్వే చేపట్టారని, కౌన్సిల్‌లో చర్చించకుండా రీసర్వే నిర్వహించడం చట్టవిరుద్ధమని అందులో పేర్కొన్నారు. ఆస్తిపన్ను రీసర్వే, పన్ను తగ్గింపు, ఆస్తిపన్ను పేర్ల మార్పు, పట్టాలు లేని ఇళ్లకు ఆస్తి పన్ను, 45 గజాలలోపు ఇళ్లకు రూ.50 వేల పన్ను విధింపు వంటి ముఖ్యమైన అంశాలపై సమావేశంలో చర్చించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జీవీఎంసీ పరిధిలోని కాలనీ పార్కులు, ఖాళీ స్థలాల ఆక్రమణల గురించి కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్‌ల హక్కులకు రక్షణ కల్పించాలని, ఈ అంశాన్ని కూడా అజెండాలో చేర్చాలని కోరారు. గత కౌన్సిల్ సమావేశంలో చర్చించినట్లుగా, ఈ నెల 6న జరిగే సమావేశంలో టీడీఆర్ సమస్యపై చర్చించాలని ప్రతిపాదించారు. కోళ్ల వ్యర్థాల కుంభకోణంపై ప్రజల్లో నెలకొన్న ఆందోళనను గంగారావు మేయర్ దృష్టికి తీసుకెళ్లారు. రెవెన్యూ షాపులు, ప్రకటనల అద్దెలు, ఇతర ఆదాయ వనరులపై, అలాగే జీవీఎంసీ ఆదాయ వ్యయాలపై సమగ్ర చర్చ జరగాలని గంగారావు తన లేఖలో విజ్ఞప్తి చేశారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



వేసవి శిక్షణ ముగింపు సందర్భంగా . ద్యాన ముద్రలో చిన్నారులు

పెదగంట్యాడ: పత్రీజీ పిరమిడ్ స్పిరిట్యువల్ ట్రస్ట్ కార్యదర్శి మీసాల శివగణేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన 17 రోజుల వేసవి శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ఈ నెల 15న అహింస పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ప్రారంభమైన ఈ శిబిరానికి విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. శిబిరంలో ప్రతిరోజూ ధ్యానం, భగవద్గీత పఠనం, ఆటలు, చదరంగంలో శిక్షణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో మాస్టర్ దేవిక, వనిత, నీలకంఠం, ధనలక్ష్మి, తులసి, స్వామి, శారద పాల్గొన్నారు.

దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ఫ్యాన్ల కొరతతో అవస్థలు



స్టేషన్‌లో ఫ్యాన్లు లేక అవస్థలు

అగనంపూడి: మండే ఎండలు, ఊపిరి సలపని ఉక్కపోత, సరిగా పనిచేయని ఫ్యాన్లతో రైల్వే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దువ్వాడ రైల్వేస్టేషన్‌కు వచ్చే ప్రయాణికులు ఉక్కపోతతో ఊపిరాడక, చెమటలు కక్కుతూ అవస్థలు పడుతున్నారు. గతంలో ప్లాట్‌ఫామ్ ఒకటిపై ముఖద్వారం వద్ద మాత్రమే షెల్టర్లు ఉండేవి. ఇటీవల జరిగిన అభివృద్ధి పనుల్లో భాగంగా రెండు వైపులా షెడ్లు ఏర్పాటు చేసినా, ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన స్టీల్, టైల్స్ బెంచీలు ఉన్న చోట ఫ్యాన్లు అమర్చలేదు. ఉన్న ఫ్యాన్లు ప్రయాణికులకు గాలి తగలని విధంగా ఏర్పాటు చేయడంతో అవి ప్రయోజనం లేకుండా పోయాయి. ప్రయాణికులు నడిచివెళ్లే మార్గంలో ఫ్యాన్లు ఏర్పాటు చేయడం, కూర్చోడానికి ఏర్పాటు చేసిన బెంచీల వద్ద అమర్చకపోవడంపై ప్రయాణికులు మండిపడుతున్నారు. రైల్వే ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, ప్రయాణికులకు అనువుగా ఉండేలా ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రోడ్డుపై గోతుల పూడ్చివేత



గోతులను పూడ్చుతున్న దృశ్యం

గాజువాక : గంగవరం పోర్టు రోడ్డులో జగ్గు జంక్షన్ నుంచి వై జంక్షన్ వరకు రోడ్డుపై ఏర్పడిన పెద్దపెద్ద గుంతలు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఈ గుంతల వల్ల ప్రమాదాలు జరుగుతాయేమోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. గుంతలను పూడ్చాలని స్థానికులు అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ సమస్యపై స్పందించిన స్థానిక మహాత్మా, మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు తన సొంత నిధులతో రోడ్డుపై ఉన్న కొన్ని గుంతలను పూడ్చారు. ఒక ఆటోలో మెటీరియల్‌ను తెచ్చుకొని, రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్న గుంతలను పూడ్చి తాత్కాలికంగా ఉపశమనం కల్పించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న గుంతలను శాశ్వతంగా పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.